"అయ్యోరామా! పెళ్లయి పట్టుమని పదిహేను రోజులు కూడా కాలేదు. ఎలా వుంది!"

"ఎలా వుండటమేమిటి! అక్కడికక్కడే.."

"హరి భగవంతుడా! ఇంత అన్యాయమా!"

ఆ అన్యాయమేమిటో, అసలేం జరుగుతుందో పూర్తిగా అర్థం కాకుండానే శేఖర్ శవం పోస్టుమార్టమ్ నుండి ఇల్లు చేరింది.

స్పృహవచ్చిన వసుంధర శవాన్ని చూసి మళ్లీ విరుచుకుపడిపోయింది.

అప్పుడే వచ్చిన నీరజ తల్లి శకుంతల కూతుర్ని పట్టుకొని వలవలా ఏడుస్తోంది.

"ఎంత అన్యాయం జరిగిందే తల్లీ! — ఉన్నందతా ఊడ్చి ఈ పెళ్లిచేశాం. ఇంత అల్పాయుష్కుడని తెలిస్తే నీ గొంతు కోసేవాళ్లం కాదు. పారాణి ఆరకముందే నీ బతుకు బండలయి పోయిందా!"

ఆమె కూతుర్ని కుదిపేసి కుదిపేసి అరగంట ఏడ్చేక...తెల్లబోయినట్లు కూతురి వైపు చూసింది.

నీరజ కంటివెంట నీటి చుక్క లేదు. తలలో రాత్రి పెట్టుకున్న మల్లెపూలు వాడనయినా లేదు. ఆమె చటుక్కున చుట్టూ చూసి తలపు దగ్గరగావేసి కూతురుతల్లో పూలు పుటుక్కున పీకేసి కాస్త ఏడవ్వే తల్లీ! లేకపోతే నల్గురూ నవ్వుతారు!" అంది నీరజ చెవిలో గుసగుసగా.

నీరజ తల్లివైపు దిగ్భ్రాంతిగా చూసింది.

"రామ్మా! శేఖర్‌ని తీసుకెళ్తున్నారు. దణ్ణం పెడుదువుగాని!" ఎవరో వచ్చి నీరజ భుజం పట్టుకుని లేవదీసేరు.

ఆమె యాంత్రికంగా నడిచి ఆ గదిలోకి వెళ్లింది.

ఆ గదిలో నేలమీద గుడ్డలో ప్యాక్ చేసినట్లున్న శేఖర్ శవాన్ని చూస్తేమ్ మనసు నొక్కేసినట్లయింది.

అతనితో తన పరిచయ కాలం కేవలం పదిహేను రోజులే! అతని గురించి నిజానికి తనకేమీ తెలీదు. రాత్రిపూటే తనకి అతనితో మాట్లాడే అవకాశం వచ్చేది. అదికూడా సిగ్గుతో తను మాట్లాడింది తక్కువ. అతను గలగలా మాట్లాడేవాడు. ఇప్పుడతను స్తబ్ధంగా పడుకొని ఉంటే.. నిజంగా అతనింక లేడా! నీరజ మనసులో ఇంకా సందేహమే!

ఎవరో నీరజని పట్టుకొని అతని కాళ్లకి నమస్కారం పెట్టించారు. ఒక్కసారి గొల్లుమని ఏడుపులు!

సరిగ్గా ఇరవై నాలుగ్గంటల క్రితం ప్రాణం నుండి వేరు చేయబడిన అతని శరీరం బూడిద కావడానికి స్మశానం వైపు తరలి వెళ్లింది.

* *** *

ఇరవై రోజుల తర్వాత మొదటిసారి వసుంధర నీరజవున్న గదిలోకి వెళ్లింది.

ఒంటరిగా మంచం మీద పడుకొని పెళ్లి ఆల్బం పేజీలు తిరగేస్తున్న కోడల్ని చూసి దుఃఖం తిరిగి పెల్లుబికింది ఆమెకు.

అయినా దాన్ని అదుపు చేసుకొని మంచం చివరగా కూర్చుంటూ "నీరజా!" అంది మెల్లిగా.

నీరజ తలెత్తి అత్తగారివైపు చూసింది.

నెలరోజుల క్రితం సర్వాలంకార శోభితయై తన ఇంట్లో అడుగుపెట్టిన కోడలు శిశిరర్తువులోని చెట్టులా మోడులా కన్పిస్తుంటే ఆమెకు కడుపులో తిప్పినట్లయింది.

కోడలి చేతిలోని ఆల్బం తీసుకొని పక్కన పెడ్తూ "మీ అమ్మగారు నిన్ను తీసుకెళ్లిపోతానంటున్నారు!" అంది మెల్లిగా.

నీరజ మాట్లాడలేదు.

"పదిహేను రోజుల అనుబంధంతో నువ్విక్కడే వుండాలని శాసించలేను. ఇలా జరుగుతుందని నాకు మాత్రం తెలుసా! తెలిస్తే నీకు నేనెంత మాత్రం అన్యాయం చేసేదాన్ని కాను.. కాని మీ అమ్మగారు నేను తెలిసి చేసినట్లు నిష్ఠూరంగా మాట్లాడుతోంది. ఆవిడబాధ ఆవిడది. అదృష్టే! పదిహేను రోజులయినా, పది నిమిషాలయినా నువ్వు నా కోడలివే! నీకెప్పుడు కావాలన్నా నా దగ్గరకి తిరిగొచ్చే అధికారం నీకుంది. ఈ కాగితాలు నీ దగ్గరుంచు!" అందామె కొన్ని కాగితాల్ని నీరజకి అందిస్తూ.

"ఏంటవి?" అంది నీరజ.

"శేఖర్‌కి మీ నాన్నగారు కట్నరూపంగా ఇల్లు రాసేరు. అది నీకే చెందుతుంది. నాకు ఒక్కగానొక్క కొడుకు వాడు. భర్తలేని నేను వాడిలోనే సర్వాన్ని చూసుకుని బతికేను. ఇప్పుడిక ఎవరికోసం బ్రతకాలి!" ఆమె ఏడుస్తూ గదిలోంచి వెళ్లిపోతుంటే శకుంతల గదిలోకొచ్చింది.

ఆమె కూతురి చేతిలోని కాగితాలవైపు చూస్తూ ఏంటి, మీ అత్తగారు వచ్చి వెళ్తున్నట్లుంది!" అంది.

ఆయనకు కట్నంగా ఇచ్చిన ఇంటికాగితాలు!" నీరజ విరక్తిగా వాటిని తల్లి చేతికి అందించింది.

"మరి బంగారం మాట!"

నేనడగలేదు.

"నిక్షేపంగా ఇచ్చిన స్కూటరు అతనితో పాటే నుగ్గునుగ్గయింది. కనీసం బంగారం సంగతన్నా అడుగుతానుండు!"

శకుంతల వెళ్లబోతుంటే నీరజ తల్లిచేతిని గట్టిగా పట్టుకొని "దయచేసి ఆ సంగతులు ఇప్పుడేం మాట్లాడొద్దు!" అంది ఏడుస్తూ.

శకుంతల నొసలువిట్లించి "నీ బతుకు ఎట్లా వెళ్లాలే!" అంది రాగం తీస్తూ.

అప్పుడే నీరజ తండ్రి నారాయణ రావు లోనికొచ్చి అమ్మాయికి అతని ఉద్యోగం ఇస్తారట. ఫేమిలీ బెనిఫిట్ ఫండని డబ్బు కూడా కొంత వస్తుంది దానికి. నువ్వు దాన్నేం పోరకు. ఇవతలికి రా!" అంటూ భార్య చేతిని పట్టుకొని ఇవతలికి తీసుకొచ్చేడు.

* *** *

ఆ రోజు నీరజ తల్లిదండ్రులతో బయల్దేరుతుంటే వసుంధర తన మెడలోని గొలుసు నీరజమెడలో వేసి "వాడితోనే రుణం తీరిపోయిందనుకోను. ఎప్పుడయినా రావాలనిపిస్తే వస్తుండు!" అని ఏడ్చింది.

నీరజకి మొదటిసారి అత్తగారిని చూసి బాధ కలిగింది. అయినా ఏం చేయలేని నిస్సహాయస్థితిలో తల్లిదండ్రుల్ని అనుసరించిందామె.

* *** *

ఆరు నెలల తర్వాత అకస్మాత్తుగా ఆఫీసు నుండి ఇంటికొచ్చిన కోడల్ని చూసి ఆశ్చర్యపోయింది వసుంధర.

"రామ్మారా! ఇన్నాళ్లకి నన్ను చూడాలనిపించిందా!" అంటూ కోడల్ని కౌగిలించుకొంది ఆప్యాయంగా.

పండి పడలుతున్న ఆకులా వున్న అత్తగారి ఒడిలో తలపెట్టుకొని "నేను ఇక్కడే ఉంటాను అత్తయ్యా!" అంది నీరజ మెల్లగా.

'ఎందుకు?' అని అడగలేదు వసుంధర.

"నీ ఇష్టం. అంది.

ఆ మర్నాడే పరిగెత్తుకొచ్చింది శకుంతల.

తేరగా దాని సంపాదన కాజెయ్యాలని దాన్ని నీ దగ్గరకి లాక్కున్నావా! ఆయుష్షు లేని వెధవని అంటగట్టి"

"అమ్మా!" నీరజ ఘర్జించి నట్లరిచింది.

"తల్లివి కాబట్టి ఊరుకొంటున్నాను. ఇంకో మాట నీ పెదవిదాటితే మర్యాద వుండదు వెళ్లు!" అంది కోపంగా.

శకుంతల కళ్లు కోపంతో పెద్దవయ్యేయి.

దీని సంగతి మీకు తెలీదు. మొగుడు పోయి ఆర్నెల్లు కాలేదు. వాడెవడో రవట. వాణ్ని పెళ్లి చేసుకొని పరువుతియ్యాలని చూస్తోంది. మేం

కాదన్నామని మీ ఇంటికొచ్చింది. ఆ సంగతి దాచి సంగనాచి వేషాలేస్తోంది జాగ్రత్త!'' అంటూ అరిచి వెళ్లిపోయింది.

తల్లి మాటలకి నీరజ ఏడుస్తూ అంతా అబద్ధం అత్తయ్యా! మా చెల్లెలి పెళ్లికి కావాలని ఇల్లు తిరిగి రాయించుకొన్నారు. వంటిమీద బంగారం తీసేసుకున్నారు. జీతం సరేసరి! ఫస్టునే లాక్కుంటారు. ఇన్ని భరించినా.. చివరకు పదిహేను రోజులకే మొగుణ్ని మింగేశావని నష్టజాతకురాలివని రోజుకొకసారన్నా తిడుతుంది. కన్నతల్లే ఇంత నికృష్టంగా మాట్లాడుతుంటే భరించలేక వచ్చేసాను'' అంది.

''రవి ఎవరమ్మా!''

అత్తగారి ప్రశ్నకి ప్రాన్పడినట్లు చూసింది నీరజ.

ఆ తర్వాత తప్పుచేసినట్లుగా తలదించుకొని ''ఇందులో నా తప్పేం లేదత్తయ్యా! అతను మా ఆఫీసులోనే పనిచేస్తాడు. నన్ను పెళ్లి చేసుకుంటానని నాన్నగారిని అడిగేడట. నా కసలేం తెలీకపోయినా నా తప్పున్నట్లు తిడుతున్నారు'' అంది బాధగా.

''నువ్వు బాధపడకు. మీ అమ్మగారి నోటి సంగతి నీకు తెలుసుగా'' అంది వసుంధర అనునయంగా.

పదిహేను రోజుల తర్వాత మనం ఈరోజు అన్నవరం వెళ్తున్నాం. బట్టలు సర్దుకో!'' అంది వసుంధర కోడలితో.

నీరజ ఆశ్చర్యపోయినా అత్తగారు చెప్పినట్లు చేసింది.

ఇద్దరూ దేవుడి దర్శనం చేసుకొని తిరగొచ్చేసేకోడలి పక్కగా కూర్చుని శేఖర్‌గురించి నీ అభిప్రాయం ఏమిటి?'' అంది వసుంధర మెల్లగా.

ఆ అనుకోని ప్రశ్నకి తెల్లబోయినట్లు చూసింది నీరజ.

వసుంధరే తిరిగి నవ్వి ''చెప్పడానికి నీ దగ్గర జవాబుండదని నాకు తెలుసు. కారణం వాడితో నీ అనుబంధం చాలా స్వల్పమైనది. పెళ్లి పెళ్లి అన్నాం. మూడు ముళ్లు వేయించుకొన్నావు. వైధవ్యం వచ్చింది అన్నాం. మంగళ సూత్రం తీసేసేవు. వాడితో సుఖాలుగాని కష్టాలుగాని పంచుకోలేదు. మీ ఇద్దరి కాపురానికి గుర్తుగా పిల్లలులేరు. వారధి లేనప్పుడు ఇవతలి తీరం అవతలి గట్టుకి ఏమీ కాదు'' అంది.

అత్తగారి మాటలు, ధోరణి విచిత్రంగా ఉన్నా మౌనంగా వింటూ కూర్చుంది నీరజ.

జీవితంగురించి నాకు తెలిసినంత నీకు తెలీదనే అనుకొంటున్నాను. నేను నా భర్తతో కొంత తియ్యని జీవితాన్నే చూశాను. ఆయన పోయినా శేఖర్ నాకు జీవితంమీద తీపికల్గించేడు. వాడి లాలనలో పాలనలో నేను మిగతా జీవితాన్ని గడపగల్గేను. మన దురదృష్టంకొద్దీ వాడు వెళ్లిపోయేడు . తల్లిగా నాకు తప్పదు. కాని... పదిహేను రోజుల భాగ్యానికి నువ్వెందుకీ దురదృష్టాన్ని జీవితమంతా మొయ్యాలి!

ఆమె మాటప్రశ్నకి వణికినట్లు చూసింది నీరజ.

''ప్రభుత్వం నీకు ఉపాధి కల్పించింది. భర్త పోగానే దిక్కుమాలిపోకుండా నీకు ఉద్యోగం వచ్చింది. ఆర్థికంగా నీకు బాధలేని మాట వాస్తవమే! కాని అదే జీవితమా! ఇంకా బాట మొదటిలోనే నిలబడ్డ నీ సుదీర్ఘ పయనానికి తోడు అవసరం కాదా!''

నీరజ అలానే చూస్తూ కూర్చుంది అత్తగారిని.

భార్యపోగానే మగవాళ్ళు ఆర్నెల్ల లోపునే పెళ్లి చేసుకోమని చెప్పిన ధర్మం మనది. దీన్ని కూడా నేను తప్పుపట్టను. హేళనా చేయను. పోయినవాళ్ల మీద ప్రేమని చాటి చెప్పుకోవడానికి బతికున్నవాళ్ల బతుకుల్ని బ్రోదు చేసుకోనవసరంలేదు. కోరికల్ని ఆవిర చేసుకొని గుండెల్ని బండలు చేసుకోవడం త్యాగం కాదు. బాధల్తో అలమటించే వారు బాధ్యతల్ని మోయ్యలేరు. కాని.. నా బాధ ఆడదాని విషయంలో కొచ్చేటప్పటికి ఈ ధర్మాలు, సిద్ధాంతాలు పక్షపాత వైఖరి వహించేయి. తోటి ఆడదే ఆడదాన్ని అర్థం చేసుకోదు. భర్తపోయిన ఆడది బొట్టు పెట్టుకుంటే చూడలేని జాతి మనది. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే నువ్వు పెళ్లి చేసుకోవాలి! అదే నా కోరిక!''

వసుంధర చివరి మాటకి బిత్తరపోయినట్లు చూసింది నీరజ.

''నేనా?'' అంది విస్తుపోతున్నట్లుగా.

''నువ్వే. శేఖర్‌తో నీ అనుబంధం ఏమంత పెద్దది! శేఖర్ పోయినప్పుడు నువ్వు బిత్తరపోయి ఏడ్చేవు,కాని ప్రేమతో కాదు. అలాంటి శేఖర్‌కోసం నువ్వు జీవితమంతా ఎందుకిలా వుండిపోవాలి! అందుకే నేను రవిగురించి అంతా తెలుసుకొన్నాను. అతను సంస్కారవంతుడు. నువ్వంటే చాలా ఇష్టపడుతున్నాడు. నువ్వు కాదనవనే నమ్మకంతో నేనే పెళ్లికి ఏర్పాటు చేసేను. ఏమంటావు'' అంది నీరజవైపు సూటిగా చూస్తూ.

నీరజదగ్గర నిజానికి జవాబులేదు.

వసుంధర తల దించుకొన్న నీరజ గడ్డం పుచ్చుకొని తలెత్తి ''నేను చదువుకొన్నది తక్కువే! కాని ప్రతి సమస్యకి న్యాయపరంగా ఆలోచించడం వల్లనే నేనీ నిర్ణయం తీసుకున్నాను. ఇది ఆదర్శం కాదు. అవసరం. రవితో నీ జీవితం సుఖమయంగా నడుస్తుందని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను. అదే నా శేఖర్‌కి ఆత్మశాంతిని మిగులుస్తుందని నా నమ్మకం'' అంది ఆర్తిగా.

నీరజ కంటిలోని చెమ్మ బిందురూపందాల్చి బుగ్గల మీదికి జారింది.

ఆమె ముందు నిలబడిన అత్తగారు ఒక దేవతలా కనిపించలేదు. ఒక తల్లిగానూ కన్పించలేదు.

ఈ సృష్టిలో ప్రేమ, అనురాగం, వీటిని పంచగల ఒకే ఒక ప్రాణి పోతపోసుకున్న స్త్రీమూర్తిగా గోచరించింది.

ఆడవాళ్లంతా నిజంగా స్త్రీలయితే?

ఆమె అత్తగారి ఒడిలో తలదాచుకొంది ఏ భాషకీ అందని ఒక రకమైన ఉద్వేగానికి లోనవుతూ.

★

